సాక్షి
కుమురం భీం

బుధవారం । 18 । జనవరి । 2023



ఆస్తి కోసం సుపారీ హత్య

కమ్మర్‌గాంలో యువతి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఆస్తి కోసమే సొంత పెద్దనాన్న, అతడి కుమారుడు హత్య చేయించినట్లు నిర్ధారించారు. 8లో▸

ఉద్యోగాల రాజమల్లు



అనుకుంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు చెన్నూర్‌కు చెందిన జోగురు రాజమల్లు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచాడు. తండ్రి చనిపోతే తల్లి కష్టపడి చదివించింది. తల్లి చెమటచుక్కలను వృథా కానివ్వలేదు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 32.1 / 16.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఒకటి రెండు డిగ్రీలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులకు సైన్స్ సెమినార్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు సైన్స్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 29న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 'దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం' అనే అంశంపై సెమినార్ ఉంటుందని పేర్కొన్నారు. రైట్ ఆఫ్ స్ర్కీనింగ్ తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థులకు మాత్రమే సెమినార్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 19న ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు టీశాట్ ద్వారా ఉపాధ్యాయులకు సెమినార్ పేపర్ ఎలా తయారు చేయాలనే అంశంపై టెలీ కాన్ఫరెన్స్ ఉంటుందని వెల్లడించారు. సెమినార్‌కు హాజరయ్యే సైన్స్ ఉపాధ్యాయులు ఫొటోను జిల్లా సైన్స్ అధికారి నంబర్ 94411 40434కు వాట్సాప్ చేయాలని సూచించారు. ప్రతీ టీచర్ సెమినార్‌లో పాల్గొనే ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'పనితీరు మార్చుకోకుంటే చర్యలు'



ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

కెరమెరి(ఆసిఫాబాద్): ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీలు పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. కెరమెరి మండలంలోని కొఠారి, రింగన్‌ఘాట్, గోయగాం, ధనోరా సుర్దాపూర్, కెరమెరి పంచాయతీల్లో మంగళవారం పర్యటించారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు లేకపోవడం, ఉన్నవాటికి సరైన నీటి సదుపాయం కల్పించకపోవడంపై ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు ఎండిపోయిన చోట వెంటనే కొత్తవి నాటాలని ఆదేశించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశానవాటికలు పరిశీలించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు వీలుగా నర్సరీల్లో మొక్కలు పెంచాలని సూచించారు. సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం కెరమెరి గ్రామ పంచాయతీని సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు ఉన్నారు.

వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే విద్యుత్ వినియోగదారుల ఫోరం కోర్టును సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ అసిస్టెంట్ డివిజన్ అధికారి శ్రీనివాస్, ఏఈ ఇమ్రాన్ ఉల్‌హక్ ఖాన్ తెలిపారు. రెబ్బెన, ఆసిఫాబాద్ టౌన్, ఆసిఫాబాద్ రూరల్ సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ ఫోరం కోర్టు ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వినియోగదారుల ఫోరం చైర్మన్ ఈశ్వరయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. రెబ్బెన, ఆసిఫాబాద్‌టౌన్, ఆసిఫాబాద్‌రూరల్ సెక్షన్ల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకలకు అన్నిఏర్పాట్లు చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ ఆదేశించారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో మంగళవారం ఏరియాలోని అన్నివిభాగాల ఉన్నతాధికారులతో రిపబ్లిక్ డే ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియాన్ని వేడుకల కోసం ముస్తాబు చేయాలన్నారు. గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎస్ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీశ్‌బాబు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కనుపాపకు రక్షణ



- 'కంటి వెలుగు'కు పకడ్బందీ ఏర్పాట్లు
- రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా రెండో విడత నేత్ర పరీక్షలు
- వారానికి ఐదు రోజుల చొప్పున వంద రోజులపాటు స్ర్కీనింగ్
- విధుల్లో 26 వైద్యబృందాలు..
- పరీక్షలకు 'ఆధార్' తప్పనిసరి

సాక్షి, ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: కనుపాపకు రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో రేపటి నుంచి ప్రారంభం కానుంది. 18 ఏళ్లు దాటిన వారందరికీ నేత్ర పరీక్షలు నిర్వహించేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో వంద రోజులపాటు 335 గ్రామ పంచాయతీలు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో శిబిరాలు నిర్వహించనున్నారు.

ఐదంచెల్లో నిర్వహణ..

మొత్తం ఐదంచెల్లో నేత్ర వైద్య శిబిరాల నిర్వహణ కొనసాగనుంది. పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 26 బృందాలను నియమించారు. ఒక్కొక్క బృందంలో వైద్యాధికారి, ఆప్తాలమిస్టు, ముగ్గురు ఆశ కార్యకర్తలు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారు. తొలుత హాజరైనవారికి ఆధార్, ఇతర వివరాలతో రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారు. రెండో అంచెలో వారికి ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత అవసరమనుకుంటే వైద్యాధికారి, ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో మరో పరీక్ష చేసి మందులిస్తారు. కళ్లద్దాలు తప్పనిసరి అనేవారికి ఆటో రిఫ్రాక్టర్(ఏఆర్) యంత్రం సాయంతో ఐదు రకాల పరీక్షలు జరుపుతారు. అవసరమైన వారికి రీడింగ్ అద్దాలిస్తారు. దృష్టిలోపం గుర్తిస్తే కళ్లద్దాల తయారీకి మరోసారి ఫొటోలు సేకరించి పీహెచ్‌సీలకు ఆర్డర్ పెట్టి 10- 15 రోజుల్లో బాధితులకు అందజేస్తారు. శిబిరాలకు వచ్చే బాధితులంతా ఆధార్‌కార్డుతో రావాలని అధికార యంత్రాంగం కోరుతోంది. అర్హుల పేర్ల నమోదు, నేత్ర పరీక్షలు, అద్దాల పంపిణీ అంతా ఆధార్ నంబరుతోనే జరుగుతుంది.

శస్త్రచికిత్సలు లేవు.. స్ర్కీనింగ్‌కే పరిమితం..

జిల్లాలో రెండో విడత కంటి పరీక్షలను ప్రభుత్వం కేవలం స్ర్కీనింగ్‌కే పరిమితం చేసింది. శస్త్రచికిత్స చేయాల్సిన వారిని ఐదో అంచెలో బృందాలు గుర్తిస్తాయి. కానీ వారు అధిక సంఖ్యలో ఉంటేనే వారందిరికీ శస్త్రచికిత్సకు రెఫరల్ చేస్తామని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. అవసరమైతేనే రిమ్స్‌కు లేదా మంచిర్యాల ఆసుపత్రులకు పంపి నిర్ణీత తేదీల్లో ఆపరేషన్ చేయించేలా చర్యలు తీసుకుంటామంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పరీక్షలకు వచ్చే వారు తప్పకుండా ఆధార్ కార్డు తెచ్చుకోవాలి. జిల్లాలో వందశాతం కంటి పరీక్షలు చేసేలా చర్యలు చేపడుతున్నాం. శిబిరాల వద్ద పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తాం.

– ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి

5,76,720 మందికి కంటి పరీక్షలు..

నేడు ఖమ్మంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం అధికారికంగా ప్రారంభమవుతుంది. 18 ఏళ్లు దాటిన వారందరికీ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పరికరాలన్నీ అందుబాటులోకి వచ్చాయి. నేత్ర పరీక్షల నిర్వహణకు 26 ఆటో రిఫ్రాక్టర్ మిషన్లను వినియోగిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు 21,828 కళ్లద్దాలు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇందులో 17,344 వైద్యబృందాలకు అందజేశారు. మిగిలిన వాటిని జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంచారు. సుమారు 350 మంది విధుల్లో పాల్గొననున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,76,720 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని జిల్లా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని శిబిరాల్లో 130 మంది, పట్టణ ప్రాంతాల్లో 300 మందిని పరీక్షించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యబృందాలు అందుబాటులో ఉంటారు.



జిల్లా కేంద్రంలో కంటివెలుగు సామగ్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డి

ప్రణాళికాబద్ధంగా 'కంటి వెలుగు' నిర్వహించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన అదనపు కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఎంహెచ్‌వో ప్రభాకర్‌రెడ్డితో కలిసి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన శిబిరాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. పరీక్షల తేదీలు తెలిసేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించి, ప్రజలందరూ శిబిరానికి హాజరయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో వార్డు అధికారులు, అంగన్‌వాడీ, ఐకేపీ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ నెల 19న ఉదయం 8.30 గంటలకు జిల్లాలో కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్నిఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఆధార్ కార్డుతో వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీవో రమేశ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అన్ని మండలాల వైద్యాధికారులు, ఎంపీడీవో, ప్రత్యేకాధికారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటన విజయవంతం చేయాలి

- ఎంపీ సోయం బాపూరావ్
- 28న ఉమ్మడి జిల్లాకు కేంద్ర హోంశాఖ మంత్రి రాక



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావ్

ఆదిలాబాద్: ఈనెల 28న ఉమ్మడి జిల్లాలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం జిల్లాల నాయకులతో మంగళవారం కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా అమిత్‌షా ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పర్యటించనున్నట్లు తెలిపారు. ముందుగా పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో పర్యటిస్తారని వెల్లడించారు. అక్కడ పార్టీ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారన్నారు. అలాగే కుమురంభీం జన్మస్థలమైన జోడేఘాట్‌ను సందర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ హోంమంత్రి ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ప్రవాస్‌యాత్రను ప్రారంభిస్తుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, కోకన్వీనర్ మయూర్ చంద్ర, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాయకులు రాథోడ్ రమేశ్, బోయర్ విజయ్, అంకత్ రమేశ్, సుహాసినిరెడ్డి, వేణుగోపాల్, నగేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న ధరల పెంపు



పెంచికల్‌పేట్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పెరిగిన రేట్లతో నిర్వాహకులకు ఊరట
- సకాలంలో బిల్లులు చెల్లించాలని వేడుకోలు
- జిల్లాలో 1258 ప్రభుత్వ పాఠశాలలు

పెంచికల్‌పేట్(సిర్పూర్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన బిల్లుల ధరలు పెంచుతూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులను జారీ చేసింది. పెరిగిన నిత్యావసరాల ధరకు అనుగుణంగా మధ్యాహ్న ధరలు పెంచాలని పలు మార్లు విజ్ఞప్తులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పెంచిన రేట్లను గత అక్టోబర్ నుంచి నిర్వాహకులకు చెల్లించనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఊరట లభించింది. జిల్లాలో 1,258 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 908 ప్రాథమిక, 180 ప్రాథమికోన్నత, 170 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

జిల్లాలో పరిస్థితి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 96వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం కేవలం సన్నబియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. వంట నిర్వాహకులే కూరగాయలు, కోడిగుడ్లు, పప్పులు, కారం, నూనె వంటి నిత్యావసర సరుకులు సమకూర్చుకుంటున్నారు. కొన్నేళ్లుగా పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం బిల్లులు పెంచకపోవడం, సకాలంలో వేతనాలు రాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు గతంలో ఒక్కో విద్యార్థికి రూ.4.97 చెల్లించగా ఇప్పుడు రూ.5.46లకు పెంచారు. ఆరు నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి గతంలో రూ.7.45 చెల్లించగా ప్రస్తుతం రూ.8.47 చెల్లించనున్నారు. 9, 10వ తరగతి విద్యార్థులకు గతంలో రూ.9.95 చెల్లించగా ఇప్పుడు రూ.10.67లకు పెంచారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందని నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాహకులకు మేలు

కోడిగుడ్లు, నూనె, ఉప్పుకారం, పసుపు ధరలు అమాంతం పెరగడంతో నిర్వాహకులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం సవాలుగా మారింది. వర్షాకాలంలో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఫుడ్ పాయిజన్ ఘటనలు సైతం వెలుగుచూశాయి. దీనికితోడు నెలల తరబడి వేతనాలు, బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మేలు చేకూరింది. పెరిగిన ధరలతో నాణ్యమైన భోజనం అందిస్తామని వారు పేర్కొంటున్నారు.

ధరల పెంపు హర్షనీయం



ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన ధరలు పెంచడం సంతోషంగా ఉంది. పెరిగిన ధరలో ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందించడం కష్టంగా ఉంది. నిర్వాహకుల అవస్థలు గుర్తించి ధరలను పెంచడంతో నాణ్యమైన భోజనం అందిస్తాం.

– మల్లిక, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, పెంచికల్‌పేట్

బిల్లులు సకాలంలో చెల్లించాలి



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించాలి. మూడు నెలలుగా వేతనాలు, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యార్థులకు భోజనం అందించటానికి అప్పులు చేస్తున్నాం.

– కమలమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, సంజీవనగర్

ఏసీడీ భారం..!

- అధిక విద్యుత్ బిల్లులతో ఆందోళనలో వినియోగదారులు
- అవగాహన లేక ప్రజల్లో అయోమయం
- డిపాజిట్ కోసమే అంటున్న అధికారులు
- జిల్లాలో 1,54,878 కనెక్షన్లు

ఆసిఫాబాద్: విద్యుత్ వినియోగదారులకు ఆ శాఖ విధించే అదనపు చార్జీలతో సతమతమవుతున్నారు. ఏసీడీ పేరుతో అదనపు బిల్లులు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడ్డగోలు కరెంటు బిల్లులతో షాక్‌కు గురవుతున్నారు. జనవరిలో జారీ చేసిన బిల్లుల్లో ఏసీడీ డ్యూ పేరుతో రూ.వేలల్లో బిల్లులు వేయడంతో సాధారణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నెలనెలా రీడింగ్ తీసుకోవాల్సిన సిబ్బంది నెల దాటిన తర్వాత రీడింగ్ తీసుకోవడంతో వినియోగదారులపై అదనపు చార్జీలు పడుతున్నాయి. ఇదిలా ఉండగా ప్రతినెలా వచ్చే బిల్లుతోపాటు విద్యుత్ సంస్థ ఏసీడీ పేరుతో అదనపు బిల్లు వడ్డించారు. ఏసీడీ అంటే ఏమిటి.. ఇది ఎందుకు వేశారో తెలియక జనం అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే ఫిక్స్‌డ్ చార్జీ, కస్టమర్ చార్జీ, ఈడీ, అదనపు చార్జీల పేరుతో బిల్లులు బాదుతున్నారు. ఒక్కో బిల్లుపై రూ.100 నుంచి రూ.150 వరకు అదనపు చార్జీలు వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,54,878 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 1,28,125 గృహాలు, 1,110 కమర్షియల్, 10,880 వ్యవసాయ కనెక్షన్లతోపాటు ఇతర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి ప్రతినెలా సుమారు రూ.4.2 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది.

అవగాహన కల్పించకుండానే..

నెలవారీ వాడకానికి రూ.వందల్లో బిల్లు వస్తే ఏసీడీ బకాయిల పేరుతో రూ.వేలల్లో వస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వక్రమార్గంలో అదనపు బిల్లులు వసూలు చేస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. కొత్తరకం చార్జీలు ఎందుకు చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు. ఏసీడీపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో అనేక మంది అద్దెకుంటున్నారు. ఈ చెల్లింపులపై అద్దెదారులు, యజమానుల మధ్య వివాదాలు సైతం తలెత్తుతున్నాయి.



జిల్లా కేంద్రంలో ఓ వినియోగదారుడికి వచ్చిన ఏసీడీ బిల్లు

డిపాజిట్ కింద..

ఏడాది కాలంలో వినియోగదారులు వాడుతున్న సరాసరి యూనిట్లను లెక్కించి రెండు నెలల బిల్లును డిపాజిట్ కింద అదనపు వినియోగ ధరావత్తు (అడిషనల్ కంజమ్షన్ డిపాజిట్- ఏసీడీ)ను జనవరి బిల్లులో చూపించారు. దీనిని ఫిబ్రవరి బిల్లుతో పాటు చెల్లించాల్సి ఉంటుంది. ఏసీడీని తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (టీఎస్‌ఈఆర్సీ) రెగ్యులేషన్ నెంబర్ - 6 ప్రకారం విధించారు. వినియోగదారుడు తమ సర్వీసు తీసుకునే సమయంలో కిలోవాట్‌కు రూ.200 చొప్పున సెక్యూరిటీ డిపాజిట్ (ఎస్‌డీ) చెల్లించాల్సి ఉంటుంది. తదుపరి వారు వాడుకునే యూనిట్ల ప్రకారం ఏసీడీని లెక్కిస్తారు. దీని నుంచి ఎస్‌డీ మినహాయించి మిగిలిన మొత్తాన్ని వారి బిల్లులో ఏసీడీగా చూపిస్తారు. ఈ డిపాజిట్‌పై ఏడాదికి ఒకసారి రిజర్వ్ బ్యాంకు రేట్ల ప్రకారం వడ్డీ లెక్కించి వినియోగదారుల బిల్లులో జమ చేస్తారు. ఈ డిపాజిట్ సర్వీసు రద్దు చేసుకున్నప్పుడు తిరిగి చెల్లిస్తారు.

రూ.1200 వచ్చింది



మాకు ఏసీడీ పేరుతో రూ.1,200 అదనంగా బిల్లు వచ్చింది. అదనపు బిల్లులు మాలాంటి వారికి భారంగా మారాయి. ఇప్పటికే పెంచిన చార్జీలు చెల్లించడం ఇబ్బందిగా ఉంది. ఉచితాల కోసం కరెంటు బిల్లులు బాదడం సరికాదు. ప్రభుత్వం బిల్లులు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

– మంతెన అనసూయ, ఆసిఫాబాద్

వినియోగానికి అనుగుణంగా..

విద్యుత్ వాడకాన్ని బట్టి అడిషనల్ కంజమ్షన్ డిపాజిట్(ఏసీడీ) బిల్లు విధించడం జరుగుతుంది. వినియోగదారులు ఏసీడీ బిల్లు చెల్లించాలి. ఏసీడీ అనేది డిపాజిట్ రూపంలో ఉంటుంది. ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని ఈఆర్‌వో కార్యాలయానికి వెళ్లి నివృత్తి చేసుకోవాలి.

– గోపాలరావు, సీఎండీ, ఎస్పీడీసీఎల్

20న జిల్లా కమిటీ సమావేశం



నినాదాలు చేస్తున్న నాయకులు

కౌటాల(సిర్పూర్): ఆదివాసీ కొలావార్, మన్నెవార్ సేవా సంఘం జిల్లా కమిటీ అత్యవసర సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనం ఎదుట మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఉదయం 11 గంటలకు జిల్లా కమిటీ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, గౌరవ అధ్యక్షుడు సుంకె కిష్టయ్య హాజరవుతారన్నారు. ఆదివాసీ సమస్యలు, హక్కులపై చర్చిస్తామని చెప్పారు. కమిటీ సభ్యులతోపాటు ఆదివాసీ అనుబంధ సంఘాలు, యువజన సంఘాల సభ్యులు సమావేశానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారి పెల్లి పోశం, అధికార ప్రతినిధి మెర్పల్లి సదాశివ్, మండల అధ్యక్షుడు భీమయ్య, నాయకులు శంకర్, సత్తయ్య, భూమయ్య, నీలయ్య, సురేశ్, నారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


రాజుబాయి(ఫైల్)

నెన్నెల: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు కీర్తి రాజుబాయి (110) సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందింది. ఇప్పటి వరకు బీపీ, షుగర్ వంటి ఎలాంటి జబ్బు రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. రాజుబాయికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు 20ఏళ్ల కిందటే చనిపోయారు. కొడుకు, కూతుళ్లకు జన్మించిన నాలుగు తరాల మనుమలు, మనుమరాళ్లు మొత్తం 102 మంది ఉన్నారు. మండలంలో అతి పెద్ద వయస్సు కలిగిన వృద్ధురాలు రాజుబాయి మృతి చెందడంతో ఆమెను చూసేందుకు జనం తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 15 ఏళ్ల జైలు

దండేపల్లి: లైంగికదాడి కేసులో నిందితుడికి 15ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువడినట్లు దండేపల్లి ఎస్సై సాంబమూర్తి మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం... మండలంలోని లక్ష్మీకాంతపూర్‌కు చెందిన ఓ దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన కడ్తల శంకరయ్య(70) అత్యాచారానికి పాల్పడగా అతడిపై దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 2021న కేసు నమోదైంది. అప్పటి సీఐ నారాయణ్‌నాయక్ ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మంగళవారం కేసు విచారణ పూర్తి కావడంతో నిందితుడికి 15ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి మైత్రేయి తీర్పు వెలువరించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేకే-5గనిపై కొండచిలువ కలకలం


బాత్‌రూంలో కొండచిలువ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5 గని ఆవరణలోని బాత్‌రూంలో కొండచిలువ కనిపించింది. మంగళవారం ఉదయం కార్మికులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి బాత్‌రూంకి వెళ్లగా భారీ కొండచిలువ దర్శనమిచ్చింది. దీంతో భయాందోళనకు గురైన కార్మికులు వెంటనే అధికారులకు సమాచారం అందించగా కొండచిలువను పట్టి పక్కనే ఉన్న అటవీప్రాంతంలో వదలివచ్చారు. ఈ సందర్భంగా గని మేనేజర్ భూశంకరయ్య మాట్లాడుతూ గని అటవీ ప్రాంతం పక్కనే ఉండడంతో గని కార్మికులు విషపురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్యాస్ గోదాముల్లో తనిఖీలు

శ్రీరాంపూర్: సీసీసీలోని బంగ్లా ఏరియా సమీపంలోని, కృష్ణాకాలనీలోని సింగరేణి ఐటీసీ గ్యాస్ గోడౌన్లలో ఆ కంపెనీ అధికారులు తనిఖీలు చేశారు. మంగళవారం కంపెనీ ప్రతినిధులు గ్యాస్‌గోడౌన్‌ను తనిఖీ చేసి అందులో స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. నెల వారి తనిఖీల్లో భాగంగా పరిశీలించినట్లు సింగరేణి సిబ్బంది పేర్కొన్నారు.

ఉద్యోగాల రాజమల్లు

అనుకుంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు ఓ యువకుడు... ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచాడు. తల్లిదండ్రులకు ఏడో సంతానం.. నిరుపేద కుటుంబం.. తండ్రి చనిపోతే తల్లి కష్టపడి చదివించింది. తల్లి చెమటచుక్కలను వృథా కానివ్వకుండా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా ఉద్యోగం చేస్తూనే ఉన్నత స్థాయి ఉద్యోగం కోసం కష్టపడుతున్న ఈ చెన్నూర్‌కు చెందిన జోగురు రాజమల్లు ఉద్యోగ విజయాలపై ప్రత్యేక కథనం. – చెన్నూర్‌రూరల్

- చదువులో రాణిస్తూ.. ఉద్యోగాలు సాధిస్తూ..
- ఏడు ఉద్యోగాలు సాధించిన వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న యువకుడు

విద్యాభ్యాసం...
ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎంతో కష్టంతో కూడుకున్న పని. పోటీ ప్రపంచంలో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఏడు ఉద్యోగాలకు ఎంపికై ఆదర్శంగా నిలుస్తున్నాడు. అతడే చెన్నూర్ మండలంలోని కొమ్మెర గ్రామానికి చెందిన జోగురు పోసక్క, చిన్నయ్య దంపతుల ఏడో సంతానమైన జోగురు రాజమల్లు. అతడిది నిరుపేద వ్యవసాయ కుటుంబం. రాజమల్లు ఒకటవ తరగతి నుంచి 7వ తరగతి వరకు అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకున్నాడు. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు జైపూర్ మండలం ఇందారంలోని గురుకుల పాఠశాలలో చదివాడు. ముథోల్‌లోని రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియట్ (ఎంపీసీ) పూర్తి చేశాడు. ఇంటర్‌లో 850 మార్కులు రాగా అతడికి పెద్దపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో సీటు రాగా బీటెక్ పూర్తి చేశాడు.

ఏడు ప్రభుత్వ ఉద్యోగాలు....
పదో తరగతిలో 520 మార్కులు రాగా వాటి ఆధారంగా రాజమల్లుకు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో 2009లో 22ఏళ్లకే కోటపల్లి మండలం జనగామ


పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న రాజమల్లు

గ్రామంలో బీపీఎం ఉద్యోగం వచ్చింది. 2009 నుంచి 2012 వరకు బీపీఎంగా పని చేశాడు. ఉద్యోగ విధులు నిర్వర్తిస్తూనే పరీక్షలకు సిద్ధమయ్యాడు. 2014లో వీఆర్వో ఉద్యోగానికి ఎంపికై నిర్మల్ జిల్లా చింతల్‌చాందా, చామన్‌పల్లిలో 2015 మార్చి వరకు విధులు నిర్వహించాడు. 2015లో ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో మల్టిటాక్స్ ఇన్‌స్టాప్ ఉద్యోగానికి ఎంపికై 2018 వరకు ఉద్యోగం చేశాడు. 2018లో మళ్లీ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో చాటింగ్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికై ఎనిమిది

చాలా కష్ట పడ్డాను

ప్రభుత్వ ఉద్యోగం చేయాలనేది నా ఆశయం. మొదట్లో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో బీపీఎం జాబ్ వచ్చింది. రెండు సార్లు వీఆర్వో జాబ్ కూడా వచ్చింది. చిన్నతనంలో అమ్మనాన్న చాలా కష్ట పడ్డారు. నాన్న చని పోయిన తరువాత అమ్మ నా కోసం ఎంతో కష్టపడ్డది. మా అన్నయ్యలు కూడా ఎంతో సపోర్ట్ చేశారు. ప్రస్తుతం రైల్వే శాఖలో సీనియర్ కమర్షియల్ క్లర్క్, టికెట్ క్లర్క్ పోస్టు వచ్చింది. 45 రోజుల పాటు శిక్షణ ఉంది. కుటంబ పరిస్థితుల నేపథ్యంలో మంచి ఉన్నత స్థానంలో ఉండాలన్నదే నా లక్ష్యం.
–జోగురు రాజమల్లు, కొమ్మెర

నెలల పాటు ఉద్యోగం చేశాడు. 2019లో మళ్లీ వీఆర్వో ఉద్యోగానికి ఆసిఫాబాద్ జిల్లాలో ఎంపికయ్యాడు. కానీ ఉద్యోగంలో జాయిన్ కాలేదు. ఆ తరువాత సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. కానీ హైకోర్టులో స్టే ఉండడంతో జాయినింగ్ కాలేదు. 2019లోనే రైల్వే డిపార్ట్‌మెంట్‌లో లెవెల్-5 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రావడంతో సీనియర్ కమర్షియల్ క్లర్క్ టికెట్ పోస్టుకు ఎంపికయ్యాడు. నాలుగు రోజుల క్రితమే ఉద్యోగం వచ్చింది. 45రోజుల పాటు శిక్షణ తరువాత ఉద్యోగంలో జాయిన్ అవుతాడు.

ఉన్నత స్థానంలో ఉండాలనే....
నిరుపేద కుటుంబానికి చెందిన రాజమల్లు కుటుంబ పరిస్థితుల నేపథ్యం, మంచి ఉన్నత స్థానంలో ఉండాలనే లక్ష్యంతోనే కష్టపడి చదివాడు. హైదరాబాద్‌లోని చిక్కడిపల్లిలో ఓ గదిని అద్దెకు తీసుకొని తన చదువును కొనసాగించాడు. అక్కడే సెంట్రల్ లైబ్రరీలో, స్టడీ సర్కిల్‌లో ఎక్కువగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవాడు. ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌కంటాక్స్ ఇన్‌స్పెక్టర్ కావాలని రాజమల్లు లక్ష్యంగా పెట్టుకొని ప్రిపేరేషన్ కూడా అవుతున్నాడు. ఉద్యోగం చేసుకుంటూనే ఇతర ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యేవాడు.

ఆస్తి కోసం సుపారీ హత్య

- సోదరిని అంతమొందించిన సోదరుడు
- ఆత్మహత్యగా చిత్రీకరణ
- పక్షం రోజుల్లో ఛేదించిన పోలీసులు
- వీడిన యువతి హత్య మిస్టరీ


వివరాలు వెల్లడిస్తున్న కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు

కాగజ్‌నగర్‌రూరల్: తమ్ముడి ఆస్తిపై అన్న, అతడి కొడుకు కన్నేశారు. అనారోగ్యంతో తమ్ముడు ఏడాది క్రితం మృతిచెందాడు. దీంతో అతడి కూతురును అంతం చేస్తే ఆస్తి తమ వశమవుతుందని భావించారు. ఈమేరకు సుపారీ హత్యకు ప్లాన్ చేశారు. ఈనెల 6న హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఈ ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పక్షం రోజుల్లో హత్య మిస్టరీని ఛేదించారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు వివరాలు వెల్లడించారు. పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం గ్రామానికి చెందిన దుర్గం దస్రుబాయి(22) ఈనెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని తల్లి శకుంతల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పెంచికల్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కమ్మర్‌గాం గ్రామానికి చెందిన భూదయ్య, లింగయ్య అన్నదమ్ములు. లింగయ్యకు కుమారుడు తుకారాం, భూదయ్యకు కూతురు దస్రుబాయి ఉన్నారు. పంపకాల్లో భూదయ్య, లింగయ్యకు చెరో ఐదెకరాల భూమిచ్చింది. భూదయ్యకు మగపిల్లలు లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న అతని బాగోగులను చూస్తే తుకారాంకు సగం వాటా ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏడాది క్రితం అనారోగ్యంతో భూదయ్య మృతి చెందాడు. ఆస్పత్రి ఖర్చుల కింద లింగయ్య కుమారుడు తుకారాం సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేశాడు. భూదయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రైతుబీమా డబ్బులు తుకారాంకు ఇవ్వలేదు. ఒప్పందం మేరకు ఆస్తిలో సగం వాటా కూడా ఇవ్వలేదు.

గొంతునులిమి హత్య..
మహేందర్ తన స్నేహితుడు ఎల్లూర్‌కు చెందిన జనగామ మహేందర్‌తో కలిసి ఈనెల 5న కమ్మర్‌గాంకు వచ్చారు. ఆ రోజు కమ్మర్‌గాంలోనే ఉండి మరుసటి రోజు ఉదయం పొలం పనులకు వెళ్లిన దస్రుబాయిని గొంతునులిమి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా నోట్లో పురుగుల మందు పోశారు. మిగిలిన సుపారీ డబ్బును బెజ్జూర్ బ్యాంకు వద్ద తీసుకున్నారు.

కూతురును చంపి ఆస్తి మొత్తం కాజేద్దామని..
భూదయ్య కూతురు దస్రుబాయిని హత్య చేస్తే ఆస్తి రాబట్టుకోవచ్చని తుకారాం, అతడి తండ్రి లింగయ్య భావించారు. ఇందుకోసం బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామానికి చెందిన మానెపల్లి మహేందర్ సంప్రదించారు. మహేందర్ తన స్నేహితుడు గబ్బాయి గ్రామానికి చెందిన విలాస్‌తోపాటు అతడి బావమరుదులు రెబ్బెన మండలం తుంగెడ గ్రామానికి చెందిన డోంగ్రి వినోద్, ప్రశాంత్ హత్య చేస్తారని ఒప్పుకున్నారు. ఈ హత్యకు రూ.లక్ష సుపారీ అడుగగా, రూ.50 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగజ్‌నగర్‌లో రూ.4,500 తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా వీరి నుంచి స్పందన రాకపోవడంతో తుకారాం.. దహెగాం మండలం మొట్లగూడ గ్రామానికి చెందిన వడాగె రమేశ్, ప్రభాకర్‌ను కలిశారు. వారు కూడా ముందుకు రాకపోవడంతో తిరిగి మానెపల్లి మహేందర్‌ను కలిసి ఒత్తిడి ఒత్తిడి తెచ్చారు.

పోలీసుల అదుపులో తొమ్మిది మంది..
పోస్టుమార్టం రిపోర్టు, విచారణలో దస్రుబాయిది ఆత్మహత్య కాదని నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులను విచారణ చేశారు. ఈ క్రమంలో లింగయ్య, తుకారాం నేరం అంగీకరించారు. హత్యచేసినవారి వివరాలు వెల్లడించారు. దీంతో తొమ్మిది మంది నిందితులు లింగయ్య, తుకారాం, మానెపల్లి మహేందర్, జనగామ మహేందర్, విలాస్, డోంగ్రి వినోద్, ప్రశాంత్, వడాగె రమేశ్, ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లతోపాటు రూ.42,500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చామని సీఐ తెలిపారు. ఈ కేసు విచారణలో ప్రతిభ చూపిన పెంచికల్‌పేట్ ఎస్సై విజయ్, దహెగాం ఎస్సై సనత్‌కుమార్‌ను సీఐ అభినందించారు.

నాగోబా జాతర వైభవంగా నిర్వహిద్దాం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు
- తాగునీరు, పారిశుధ్యం లోపించకుండా చూడాలి
- నాగోబా జాతర సమీక్షా సమావేశంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్


పూజలు చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్


కోనేరును పరిశీలిస్తున్న కలెక్టర్

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మహాపూజతో ప్రారంభం కానున్న కేస్లాపూర్ నాగోబా జాతరను ఘనంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డితో కలిసి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ముందుగా నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో దర్బార్‌హాల్‌లో సమావేశమయ్యారు. శాఖల వారీగా ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కోవిడ్‌తో రెండు సంవత్సరాల తరువాత భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలిపారు. ఈ నెల 24న నిర్వహించే దర్బార్ సమావేశానికి గిరిజన సంక్షేమశాఖ, దేవాదాయశాఖ మంత్రులు రాథోడ్ సత్యవతి, ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉందని వివరించారు. జాతర ముగింపు వరకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా నలుమూలలతో పాటు మహారాష్ట్ర నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య రాకుండా చూడాలని చెప్పారు. జాతరలో ప్రతీ ఒక్కరు కోవిడ్ నిబంధనలు పాటించేలా చూడాలని తెలిపారు. బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆర్డీవో కదం సురేష్, ఏఎస్పీ హర్షవర్ధన్, డీడీ దిలీప్‌కుమార్, ఆలయ ఈవో రాజమౌళి, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఏఎస్‌డీ కృష్ణయ్య, అదనపు వైద్యాధికారి కుమ్రం బాలు, ఏవో రాంబాబు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం


మాట్లాడుతున్న లక్ష్మణ్

తాండూర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర పాలక ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ విమర్శించారు. మంగళవారం తాండూర్ ఐబీ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాల ప్రజలకు అందించడంలో వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగం తీవ్రంగా ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, పోడు భూముల సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి రాజేష్, మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, సీపీఐ నాయకులు జీసీ మాణిక్యం, శంకర్, ప్రహ్లాద్, శంకర్, భీమయ్య ఉన్నారు.

విద్యుత్ ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- రూ.5లక్షల ఆస్తినష్టం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్: ప్రమాదవశాత్తు ఇంటి కరెంట్ మీటర్‌లో నుంచి మంటలు వ్యాపించి మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన జలంపల్లి రామయ్య అనే రైతు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. రామయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రామయ్య, ఆయన భార్య లత ఇద్దరూ పొలం పనుల నిమిత్తం బయటకు వెళ్లగా వారి పిల్లలు సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లోని కరెంట్ మీటర్‌లో మంటలు చెలరేగడం అవి కాస్త పత్తిపై పడటంతో మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గమనించిన స్థానికులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కానరాలేదు. ఎస్టీపీపీ ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇంట్లోని కర్ర, విలువైన వస్తువులు, 50క్వింటాళ్ల పత్తి కలి పోయింది. రూ.5లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు రామయ్య వాపోయాడు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎస్సై రామకృష్ణ, సర్పంచ్ లింగారెడ్డి, ట్రాన్స్‌కో డిపార్టుమెంట్ సిబ్బంది పరిశీలించారు.

ప్రైవేటీకరణతో ఉద్యోగులకు అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న కోదండరామ్

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ ప్రైవేటీకరణతో ఉద్యోగులు దోపిడీకి గురవుతారని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన బెల్లంపల్లి రీజియన్ లెవల్ సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలో సమాన పనికి సమాన వేతనం అని రాసినంత మాత్రాన యాజమాన్యం అమలు చేయడంలో విఫలమవుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గ పోరాటాలతోనే ఉద్యోగులకు వేతనాలు పెరిగాయని గుర్తు చేశారు. హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజిరెడ్డి, సుదర్శన్, టీఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ మణిరాం సింగ్, ఉపాధ్యక్షుడు గద్దల నారాయణ, నాయకులు ఏడుకొండలు, మల్లయ్య, కమెర్ల గట్టయ్య ఉన్నారు.

డిగ్రీలో పది మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం డిగ్రీ సెమిస్టర్-3,5 పరీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షల్లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో పది మంది విద్యార్థులు డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. భైంసాలోని గోకుల్‌దాస్ పురుషోత్తందాస్ లడ్డ డిగ్రీ కళాశాలలో నలుగురు, నిర్మల్‌లోని నందన డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాలలో నలుగురు చొప్పున డిబారైనట్లు పేర్కొన్నారు.

యువకుడికి పదేళ్ల జైలు

బెల్లంపల్లి: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడికి న్యాయమూర్తి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారు. బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్ హెచ్‌ఓ ముస్కేరాజు కథనం ప్రకారం... 2017లో కాంట్రాక్టర్ బస్తీలో నివాసం ఉంటున్న తొమ్మిదో తరగతి చదువుతున్న మైనర్‌ను అదే బస్తీకి చెందిన జాడి విజయ్‌కుమార్ కిడ్నాప్ చేసి ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో నివాసం ఉంటున్న తన బంధువుల ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక అమ్మమ్మ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై గంగరాజంగౌడ్ కేసు నమోదు చేశాడు. అప్పటి ఏసీపీ సతీష్ కోర్టులో చార్జీషీట్‌ను దాఖలు చేశారు. సాక్ష్యాలతో కేసును నిరూపించడంతో మంచిర్యాల ఫస్ట్ అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్టు (పోస్కో) న్యాయమూర్తి జే.మైత్రేయి పదేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ రాజు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

మందమర్రిరూరల్: హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై చంద్రకుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన లింగయ్య పెద్ద కూతురు స్రవంతి నాలుగేళ్లుగా చిలుక ప్రశాంత్‌తో సహజీవనం సాగిస్తోంది. ఇటీవల స్రవంతితో ప్రశాంత్ గొడవపడి భౌతికదాడికి దిగాడు. దీంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎక్కడికి వెళ్లిందో చెప్పాలంటూ పలుమార్లు లింగయ్య ఇంటి వద్దకు వచ్చి ప్రశాంత్ గొడవకు దిగాడు. ఆదివారం రాత్రి ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించగా స్థానికులు ఆర్పివేశారు. లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రశాంత్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

బైకును ఢీ కొట్టిన కారు

- ఒకరు దుర్మరణం


మల్లయ్య మృతదేహం పరిశీలిస్తున్న ఎస్సై

జన్నారం: అతివేగం, అజాగ్రత్త ఒకరి ప్రాణాన్ని బలికొంది. వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృత్యువాత పడ్డారు. ఎస్సై తానాజీ నాయక్ వివరాల ప్రకారం... మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన అల్లం మల్లయ్య (56) సోమవారం సాయంత్రం 9గంటల ప్రాంతంలో మందొపెల్లి గ్రామ సమీపంలోని పెట్రోల్‌బంక్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇందన్‌పల్లి నుంచి జన్నారం వైపు వేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని జన్నారం ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. మల్లయ్యకు భార్య గంగవ్వ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గనిలో స్పృహ కోల్పోయిన కార్మికుడు


చికిత్స పొందుతున్న కార్మికుడు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని భూగర్భ గనిలో మంగళవారం ఓ యువకార్మికుడు స్పృహ తప్పి పడిపోయిన ఘటన వెలుగు చూసింది. భూగర్భంలోని 63 లెవల్ 7డీప్‌లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో దేవ రమేష్ అనే జనరల్ మజ్దూర్ కార్మికుడు ఆకస్మికంగా పడిపోయాడు. ఉదయం 10 గంటల డ్యూటీలో ఈ ఘటన చోటుచేసుకుంది. వెంటనే అతడి ని సహచర కార్మికులు గని ఉపరితలానికి తీసుకు వచ్చి స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భూగర్భంలో వెంటి లేషన్ సమస్య వల్లనే రమేష్ కిందపడి పోయినట్లు కార్మికులు పేర్కొన్నారు. సదరు కార్మికుడిని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్దం శెట్టి రాజమొగిలి, ఇతర సంఘాల నాయకులు, కార్మికులు ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.



జన్నారం డివిజన్‌లో పక్షుల కోలాహలం



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవి డివిజన్‌లో పక్షులు కోలాహలం చేస్తున్నాయి. శీతాకాలం కావడంతో సుదూర ప్రాంతాల పక్షులు వలస వచ్చి ఇక్కడ వాటి సంతతిని పెంచుకుంటాయి. ఈ క్రమంలో జన్నారం అటవి డివిజన్‌లోని మైసమ్మ కుంట, బైసన్ కుంట ప్రాంతాలలో పక్షుల కోలాహలం కనిపించాయి. ఆసియా దేశాలకు సంబంధించిన ఆసియన్ ఓపెన్ బిల్ స్ట్రోక్, నార్తెన్ పింటెల్ పక్షులు ఆయా ప్రాంతాలలో కనిపించాయి. –జన్నారం





